క్లుప్తంగా

విజయ్‌కుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగం పరిశోధకుడు ఎం.విజయ్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రొటీన్ ఎనర్జీ లైసిన్ అండ్ మెథైనిన్ రిక్వైర్‌మెంట్ ఫర్ బ్రాయిలర్స్ రేర్డ్ అండర్ ఓపెన్ సైడెడ్ హౌసింగ్ సిస్టమ్ ఇన్ హాట్ అండ్ కోల్డ్ వెథర్ కండిషన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి విజయ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ పర్యవేక్షణలో విజయ్‌కుమార్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. విజయ్‌కుమార్ ప్రస్తుతం వరంగల్ ఎల్‌బీ కళాశాలలోని ఫౌల్ట్రీ విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

బాధితురాలికి పరామర్శ

మడికొండ: కిడ్నీ సంబంధిత సమస్యతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్ తల్లి లక్ష్మిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎల్‌ఐసీ డివిజనల్ యూనియన్ జనరల్ సెక్రటరీ మర్రి ప్రభాకర్, రఘుచందర్ పాల్గొన్నారు.

వీడియో మార్ఫింగ్ చేసిన వారిపై చర్య తీసుకోవాలి



హసన్‌పర్తి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిపై మార్ఫింగ్ వీడియోలు చేసి ప్రచారం చేస్తున్న వారిపై తక్షణమే చర్య తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు డాక్టర్ కొమురయ్య, కత్తెరపల్లి దామోదర్, కేయూ ఇన్‌చార్జి జట్టి రాజేందర్, కందికొండ తిరుపతి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు ఆర్థికంగా ఎదగాలి



కాజీపేట అర్బన్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో పార్టీ కార్యకర్త అభిరామ్ ఏర్పాటు చేసుకున్న పవన్ ట్రేడర్స్ హార్డ్‌వేర్ అండ్ ప్లంబింగ్ షాపును రాఘవరెడ్డి ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగాల కోసం వేచి చూడకుండా స్వయం ఉపాధితో యువత ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, రాజారపు స్వామి, కట్కూరి రమేష్, సదానందం, ఆకారపు శివాజీ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కాజీపేట అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో హంటర్‌రోడ్డులోని కడాయి డ్రైవ్ ఇన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. శరత్ మ్యాక్స్ ఐ విజన్ వైద్యులు శరత్‌కుమార్, ప్రసాదరావు, దివ్యధాత్రి, డెంటల్ వైద్యులు ప్రతీక్, ప్రసాద్, గైనకాలజిస్ట్ మానస, శ్రీపాల్, రాజేశ్వరి, ఫిజిషియన్ రిదిమ పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు అన్నం రవీంద్రనాథ్, సెక్రటరీ శిరీష్‌కుమార్, ట్రెజరర్ గంగోజుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అన్నదాతలు



కమలాపూర్ : కాలం కలిసివస్తే పది మందికి పనులు కల్పించే కర్షకులు వారు. పంట సాగులో ఇతరులకు ఉపాధి కల్పించి పట్టెడన్నం పెట్టే అన్నదాతలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలుగా పని చేస్తున్నారు. మొన్నటిదాక సాగు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడి ఎలాగోలా పంట కోతలు పూర్తి చేసిన రైతులు ప్రస్తుతం ఎలాంటి వ్యవసాయ పనులు లేక ఖాళీగా ఉంటున్నారు. ఇదే తరుణంలో మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద ఎండిపోయిన చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులు, ఎస్సారెస్పీ కాల్వల్లో సిల్ట్ తొలగింపు పనులు జోరుగా సాగుతున్నాయి.

కాకాజీకాలనీలో కానరాని అభివృద్ధి

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- వర్షమొస్తే జలమయమే
- రెండు దఫాలుగా ఒకే కార్పొరేటర్
- అయినా కనిపించని ప్రగతి



కాకాజీకాలనీలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



కాలనీలోని ఓ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (ఫైల్)



పగుళ్లుబారి అధ్వానంగా ఉన్న సీసీ రోడ్డు



నాలాపై అర్ధంతరంగా వదిలేసిన స్లాబ్ నిర్మాణం

హన్మకొండ చౌరస్తా: వాణిజ్య, వ్యాపార సముదాయాలతో నిత్యం రద్దీగా ఉండే హనుమకొండ చౌరస్తాకు అతి సమీపంలో ఉన్న కాకాజీ కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కాకాజీకాలనీలో అత్యధిక శాతం ప్రైవేట్ ఆస్పత్రులు ఉండడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన అనేక మంది వస్తుంటారు.

అధ్వానంగా రోడ్లు

24 గంటల పాటు రోగులు, వారి బంధువులతో రద్దీగా ఉండే ఈ కాలనీలో అంతర్గత రోడ్లు కంకర తేలి అధ్వానంగా ఉన్నాయి. కాకాజీకాలనీలో పదికి పైగా అంతర్గత సీసీ రోడ్లు ఉండగా అందులో చాలావరకు పగుళ్ల బారి, కంకరతేలి ఉన్నాయి. వైద్యులు, రోగుల బంధువులకు సంబంధించిన వాహనాలు, బైక్‌లు ఇరుకైన రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో అంబులెన్స్ వెళ్లాలంటే అతి కష్టంగా మారింది. కాకాజీ కాలనీలో రోడ్లన్నీ ఇరుకుగా మారడంతో అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్‌లో వచ్చే రోగులకు తిప్పలు తప్పడం లేదు.

వర్షాకాలంలో జలమయం

వర్షాకాలం వచ్చిందంటే చాలు కాకాజీకాలనీ జలమయం అవుతుంది. కాలనీలోని సైడ్ డ్రెయినేజీ కనబడకుండా ఆస్పత్రుల యాజమాన్యాలు ర్యాంప్‌లు నిర్మించడంతో వ్యర్థాలు నిలిచిపోయి వరదనీరు రోడ్లపైకి చేరుతోంది. సుమారు ఐదేళ్ల క్రితమే గోమతి ఆస్పత్రి నుంచి చౌరస్తా వరకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ చేపట్టిన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అర్ధంతర డ్రెయినేజీ పనులు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు

అసలే ఇరుకైన కాలనీలో రోడ్లకు ఇరువైపులా చెత్తను వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. రోగాలను నయం చేసుకోవడానికి వచ్చే రోగులు, వారి వెంట వచ్చే బంధువులకు దుర్వాసనతో మరో కొత్త వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో చెత్తకుండీలు అందుబాటులో లేకపోవడం వల్లనే చెత్తను రోడ్లపై వేయాల్సి వస్తోందని ఆయా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బంది వాపోతున్నారు.

పట్టించుకోని కార్పొరేటర్

డివిజన్ల పునర్విభజనకు ముందు 39వ డివిజన్ పరిధిలో, ప్రస్తుతం 7వ డివిజన్ పరిధిలో ఉన్న కాకాజీకాలనీకి కార్పొరేటర్‌గా వేముల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గత పర్యాయం కాంగ్రెస్ నుంచి పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచిన శ్రీనివాస్ అనతి కాలంలోనే టీఆర్‌ఎస్ పార్టీలో చేరాడు. ఆ తర్వాత జరిగిన గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలిచి, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీలో చేరారు. రెండు దఫాలుగా అధికార పార్టీలో కార్పొరేటర్‌గా ఉన్నప్పటికీ కాలనీని అభివృద్ధి చేయలేదని స్థానికులు చెబుతున్నారు.

కుంటను తలపిస్తోంది



చిన్నపాటి వర్షమొస్తే చాలు కాకాజీకాలనీ చెరువును తలపిస్తుంది. కాలనీలో అత్యధిక శాతం ఆస్పత్రుల యజమాన్యాలు డ్రెయినేజీలపై ర్యాంపులు నిర్మించాయి. దాంతో చెత్త పేరుకుపోయి వర్షాకాలంలో కాలనీని వరద ముంచెత్తుతోంది. చిన్నపాటి వర్షానికే కాలనీ మొత్తం కుంటను తలపిస్తోంది. అయినా కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోకపోవడం బాధాకరం.

- వెంకటాచారి, హనుమకొండ


శాశ్వత పనులు చేపట్టాలి



వర్షాకాలం వస్తే నాలాల పూడిక తీస్తున్నామంటూ హడావుడి చేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు.. శాశ్వత ప్రాతిపదికన నాలాలను అభివృద్ధి చేయకపోవడం శోచనీయం. ఆస్పత్రులు, పేరుమోసిన వైద్యులు ఉండే కాకాజీకాలనీలో రోడ్లన్నీ ఇరుకుగా ఉండడంతో నడక కూడా కష్టంగా మారుతోంది. రోడ్లు సైతం గుంతలు పడి, కంకరతేలడంతో రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

- పున్నం, హనుమకొండ

రాజరాజేశ్వరి దేవి ఆలయ వార్షికోత్సవం



రాజరాజేశ్వరి దేవి

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయ 53వ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో భాగంగా సోమవారం విఘ్నేశ్వరస్వామి వారికి 53 లీటర్ల చెరుకు రసంతో అభిషేకం, అర్చన, హోమం, 28న రాజరాజేశ్వరి దేవి జన్మదినోత్సవం సందర్భంగా 53 రకాల సుగంధ ద్రవ్యాలు, 135 లీటర్ల ఆవుపాలతో అమ్మవారికి విశేష అభిషేకం, తొమ్మిది రకాల పుష్పాలతో లక్షపుష్పార్చన, 29న సుబ్రహ్మణేశ్వర స్వామికి 53 లీటర్ల ఆవుపాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ కోరారు.

ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యం



హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాయుపుత్రకాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. ఈమేరకు బాధితుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఈనెల 25వ తేదీన రాంచందర్‌రావు(52) తన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దాంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు.. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. సదరు వ్యక్తి కనిపిస్తే 87126 85115, 87126 85089 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

ముగిసిన ఓరుగల్లు నృత్యోత్సవం



మెమొంటో, ప్రశంస పత్రాలతో కళాకారులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో భ్రమరాంబ కళాశారద ఆధ్వర్యంలో ప్రారంభమైన ఓరుగల్లు నృత్యోత్సవం- 2024, ఆల్ ఇండియా డాన్స్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా రైల్వే ఎలక్ట్రికల్ సీనియర్ డీఈఈ ప్రశాంత కృష్ణసాయి మాట్లాడుతూ దేశంలో ప్రాచీన కళా సంపదను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కూచిపూడి, భరతనాట్యం, తదితర నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు మెమొంటోలు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ దీపిక, నృత్య కళాకారులు పాల్గొన్నారు.

ఎంజీఎం మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రామన్నపేట: ఎంజీఎం ఆస్పత్రితో చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. కాలికి గాయం చికిత్స కోసం ఈనెల 7న ఎంజీఎం ఆస్పత్రికి స్వతహాగా వచ్చిన సదురు వ్యక్తి.. చికిత్స పొందుతూ 21వ తేదీన మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు ధ్రువీకరించినట్లు పేర్కొన్నారు. సుమారు 50 ఏళ్ల మృతుడి వివరాలకు 87126 85117, 87126 85090, 87126 85005 నంబర్లలో లేదా మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

ప్రతాప్ మెమోరియల్ క్రికెట్ టోర్నీకి తీర్మానం



సమావేశంలో క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు త్వరలో వరంగల్ క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షుడు దివంగత గుజ్జారి ప్రతాప్ స్మారక టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు అసోసియేషన్ జనరల్ బాడీ ఏకగ్రీవంగా తీర్మానించింది. హనుమకొండలోని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో 2023 - 24 వార్షిక జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలో జరిగిన అభివృద్ధిని సభ్యులకు జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ (మార్షల్) వివరించారు. లీగల్ అడ్వైజర్‌గా సత్యప్రకాష్, వరప్రసాద్ చార్టెడ్ అకౌంట్ తిప్పర్తి రాఘవరెడ్డి ప్రతిపాదించగా జిల్లాలోని 33మంది క్లబ్ కార్యదర్శులు ఆమోదించారు. అనంతరం సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు దివంగత అనిల్ మెమోరియల్ టోర్నమెంట్‌ను అండర్ -19 కేటగిరీతో పాటు, అండర్ -16 కేటగిరీలో నిర్వహించేందుకు క్లబ్ కార్యదర్శులు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. కమిటీ చైర్మన్‌గా కోదండపాణి, సభ్యులుగా మార్నేని ఉదయ భానురావు, అరుణ్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామిచరణ్‌ను నియమిస్తూ జనరల్ బాడీ ఆమోదించినట్లు వివరించారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఖాజా, రఘురాం, స్వామిచరణ్, సంయుక్త కార్యదర్శి ఉపేందర్, కోశాధికారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, అభినవ్ వినయ్, మట్టెడ కుమార్, రాము పాల్గొన్నారు.

'మల్లికాంబ'కు బియ్యం అందజేత



వరంగల్: హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని దివ్యాంగులకు అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రవీందర్ క్వింటాల్ బియ్యం, పండ్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజు వేడుకలను అనాథ పిల్లల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అభాగ్యులకు దాతలు చేయూతనివ్వాలని సూచించారు. కార్యక్రమంలో రత్నాకర్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు అవకాశాలున్నా గైడెన్స్ కరువు



కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి హాజరైన వారితో నిర్వాహకులు

హన్మకొండ అర్బన్: ఆధునిక కాలంలో యువతకు అనేక అవకాశాలు ఉన్నా మార్గనిర్దేశం చేసే వారు కరువయ్యారని బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. నిరుద్యోగ యువత ఆర్థికంగా స్థిరపడుతూ ఇతరులకు ఉపాధి కల్పించాలనే ఆలోచనతో బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనియన్ కార్యాలయంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఆర్థికంగా ఎదగాలని, అందుకోసం ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఆర్థికంగా ఎలా ఎదగాలో ఈ సందర్భంగా వివరించారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కెరీర్ గైడెన్స్ ట్రైనర్లు వినోద్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, రాజమౌళి, శ్రీశైలం శ్రీనివాస్, సంకెళ్ల మహేందర్, లింగం, లోకుల రఘుపతి, మాడుగుల కుమారస్వామి, కూరపాటి విజేందర్, బరిగెల భాస్కర్, సాదుల నర్సింహస్వామి, మేరుగు హరి, పోతరాజు అశోక్, హైమ, లావణ్య, స్వప్న, సల్ల ఉమ, నీరటి రాజు, సింగారపు రామకృష్ణతో పాటు కో ట్రైనర్లు శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచాలి



వరంగల్ / ఖిలా వరంగల్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అధిక సంఖ్యలో పట్టభద్రులు ఓటువేసేలా పోలింగ్ శాతం పెంచేందుకు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నేత, తూర్పు ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో ఆయన ఆదివారం పర్యటించారు. పోలింగ్ ప్రక్రియపై బూత్ అధ్యక్షులు, ఏజెంట్లకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, కర్నె రవీందర్, కుమార్, నాగరాజు, శ్రీనాథ్, తోట సురేష్, అశోక్, వాసుదేవ్, అర్జున్, రాజ్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



రంగశాయిపేట కళాశాలలో ఏర్పాట్లు

ఖిలా వరంగల్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మండల కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం జరగనున్న ఎన్నికకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారు. మండల పరిధిలోని శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో 128, 129, 130వ బూత్‌లు ఏర్పాటు చేయగా, రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో 121, 122, 123, 124వ బూత్‌లు, కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో 125, 126, 127వ బూత్‌లను ఏర్పాటు చేశారు. మండల పరిధిలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది సామగ్రితో ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ నందిరామ్ నాయక్ తెలిపారు.

పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

మడికొండ: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల విధుల్లో భాగంగా కాజీపేట మండలం మడికొండలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మొదటిసారిగా మడికొండలో బూత్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 12వందల మందికి పైగా ఓటర్లు ఉన్నట్లు సమాచారం.

108 పైలట్ల సేవలు అభినందనీయం



పైలట్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న శివకుమార్

హన్మకొండ అర్బన్: ప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలను రక్షించడంలో 108 అంబులెన్స్ పైలట్లు ప్రాణదాతలుగా నిలుస్తున్న తీరు అభినందనీయమని 108 ప్రాజెక్ట్ ఆఫీసర్ పాటి శివకుమార్ కొనియాడారు. హనుమకొండ కలెక్టరేట్‌లో 108 సిబ్బంది నేషనల్ పైలట్ డే వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి మాట్లాడారు. వారి కుటుంబాల్లో అనేక కష్టనష్టాలు ఉన్నప్పటికీ వృత్తి ధర్మం కోసం అత్యవసర సేవల్లో భాగంగా ప్రజాసేవకు పాటుపడుతున్న 108 పైలట్ల సేవలు గొప్పవన్నారు. నేషనల్ పైలెట్ డే సందర్భంగా ఏంఆర్‌ఐ సంస్థ జిల్లా ఉత్తమ పైలట్లుగా గుర్తించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని 108, 102 వాహనాల పైలట్లు మోడి సుమన్, పాముల అర్జున్‌వర్మకు శివకుమార్ ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల మేనేజర్లు లక్ష్మణ్, రాము, 108 సిబ్బంది, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌గౌడ్

కాజీపేట అర్బన్: పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, వరంగల్ జిల్లా నాయకుడు శివపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే ఎత్తివేయాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో జీవన్‌గౌడ్ మాట్లాడారు. ఫిబ్రవరిలో ప్రజా సంఘాల నాయకులపై బనాయించిన అక్రమ కేసులో భాగంగా ఈనెల 18వ తేదీన విద్యార్థి నాయకుల పేర్లను చేర్చడం దారుణమని వాపోయారు. యూనివర్సిటీలో విద్యార్థుల నుంచి సంతకాల సేకరించి, పోస్ట్ కార్డుల ద్వారా ఈ కుట్ర కేసు విషయాన్ని సీఎంకు తెలిపే విధంగా చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ రంజిత్‌కుమార్, విజయ్‌కన్నా, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, సంతోష్ పాల్గొన్నారు.

'సమాచార చట్టం' ఉపయోగకరం



సమావేశంలో మాట్లాడుతున్న కేశవులు

నయీంనగర్: యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టంతో సమాజంలో విప్లవాత్మక మార్పులతో పాటు ప్రజలకు విస్తృత సేవలు అందుబాటులోకి వచ్చి జవాబుదారితనం పెరిగిందని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బి.కేశవులు అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అవగాహన సదస్సులు, ర్యాలీలు, ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగించినట్లు వివరించారు. డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అంశాలపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసి నగదు ప్రవాహాన్ని అరికట్టేందుకు పాటుపడినట్లు వెల్లడించారు. సమావేశంలో గాడిపల్లి మధు, ఉషారాణి, సాంబయ్య, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాలనీలో కుక్కల బెడద



కాలనీలో స్వైర విహారం చేస్తున్న కుక్కలు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే కాలనీలో వీధి కుక్కల బెడద అధికమైందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పాత స్టీమ్‌షెడ్‌కు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, పార్కు వద్ద కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో ఉదయం, సాయంత్రం పార్కుకు వెళ్లే రైల్వే కార్మికులు, వారి కుటుంబ సభ్యులు జంకుతున్నారు. గతేడాది పార్కు వద్ద బొమ్మలు అమ్మి జీవనం సాగించే ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రెండు కుటుంబాలు విశ్రాంతి తీసుకోవడానికి వచ్చిన సమయంలో నాలుగేళ్ల బాలుడిపై కుక్కలు దాడిచేసి చంపిన దుర్ఘటన అందరిని కలిచివేసింది. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రైల్వే అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

వరంగల్ చౌరస్తా: ఆంధ్ర విద్యాభివర్ధిని (ఏవీవీ) హైస్కూల్‌లో 1998 - 1999లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వరంగల్ చౌరస్తాలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరు ఒకచోట కలుసుకుని నాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. విద్యబోధన చేసిన అప్పటి గురువులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)